దాళ్వా రైతులను ఆదుకునేదెవరు?

- ప్రభుత్వం నుంచి హామీ లేదు
- రైతులకు అందని గిట్టుబాటు ధర
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

పెనమలూరు: మరోసారి రైతులకు కష్టకాలం వచ్చిపడింది. సార్వా (ఖరీఫ్)సాగులో ప్రభుత్వం నుంచి సాయం అంతంత మాత్రంగా అందగా, ఇక దాళ్వా (రబీ)సాగుకు ప్రభుత్వం నుంచి హామీయే కరువైంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే పెనమలూరు మండలంలో రైతులు ఆనవాయితీగా రెండవ పంటగా దాళ్వా(రబీ)సాగు చేస్తుంటారు. ఈ ప్రాంతంలో మినుము పంట సాగుకు పరిస్థితులు అనువుగా లేక పోవటంతో రైతులు దాళ్వా సాగుపైనే ఆధారపడుతున్నారు. మండల పరిధిలో దాళ్వా సాగు దాదాపు 3 వేల ఎకరాల్లో జరుగుతుంది. గత ఏడాది మండలంలో 2100 ఎకరాల దాళ్వా సాగు జరగగా ఈ ఏడాది 3 వేల ఎకరాలకు పైగా దాళ్వా సాగు చేయాలని రైతులు సన్నద్ధమయ్యారు. రైతులు ఎంటీయూ 1156 రకం వరి విత్తనం సాగు చేయటానికి నారుమళ్లు పోశారు. ఈ వంగడం 110 రోజుల్లో సాగు ముగిసి దిగుబడి వస్తుంది. ఎకరాకు 40 బస్తాలు దిగుబడి వస్తుందని అంచనా. దాళ్వా సాగుకు ఎకరాకు రూ 30–35 వేలు ఖర్చు అవుతుంది. అయితే గిట్టుబాటు ధర లేక రైతులకు సమస్యలు వెంటాడుతున్నాయి.


దాళ్వా సాగుకు సిద్ధమైన వరి నాట్లు

దాళ్వా సాగుకు కారణం ఇదే...

మండలంలో రైతులు దాళ్వా సాగు చేయటానికి అనేక కారణాలు ఉన్నాయి. వాస్తవానికి రైతులు రెండో పంట మినుము, మొక్కజొన్న లేదా జొన్న సాగు చేస్తే లాభం వస్తుంది. అయితే ఇక్కడి పంట పొలాల్లో డ్రైనేజీ వసతి అంతంత మాత్రంగా ఉండటం, పొలాల్లో నీరు నిలిచి పోవటంతో మినుము, మొక్కజొన్న, జొన్న సాగు వలన రైతులకు నష్టం చేకూరుతుంది. పంట కుళ్లి పోవటమే కాకుండా పురుగు ఆశిస్తుండటంతో నష్టం వాటిల్లుతుంది. మినుము పంటకు పల్లాకు తెగులు ఎక్కువగా వస్తుంది. మొక్క జొన్న పంటకు పురుగు ఆశిస్తుండటంతో పంట దెబ్బతింటుంది. దీంతో గత్యంతరం లేక రైతులు దాళ్వా సాగుకే మొగ్గు చూపుతున్నారు.

దాళ్వా రైతుల సమస్య తీరేదెలా?

దాళ్వా సాగు చేసే రైతులకు అనేక సమస్యలు ఉన్నాయి. దాళ్వా సాగులో వరి ఎకరాకు దాదాపు 40 బస్తాలు దిగుబడి వస్తుండగా ధాన్యం కొనుగోలు పెద్ద సమస్యగా ఉంది. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని దళారులు దందా చేస్తున్నారు. దాళ్వా ధాన్యం బస్తా కేవలం రూ.1150కి మించి రైతులకు ధర ఇవ్వటం లేదు. దాళ్వాలో పంటను(ధాన్యం) ప్రభుత్వం కొనుగోలు చేయక పోవటంతో గిట్టుబాటు ధర రైతులకు కరువైంది. దళారులు, మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారు. ప్రస్తుతం దళారుల కన్ను దాళ్వా సాగుపైనే ఉంది. అలాగే ఎరువులు, పురుగు మందులు కూడా సకాలంలో అందటం లేదు. పంటను బోరు నీరు ద్వారానే సాగు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం కాలువలతో నీరు ఇవ్వలేమని స్పష్టం చేసింది. విద్యుత్ చార్జీలు రైతులకు భారంగా మారనున్నాయి. రైతులకు సాగు ఖర్చు భారంగా ఉన్నా ప్రభుత్వం ధాన్యం గిట్టుబాటు ధర దాళ్వా రైతులు ఇవ్వక పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు పంటకు రూ.5 వేలు కూడా మిగలటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దాళ్వాపై హామీ ఇవ్వని సీఎం

దాళ్వా సాగు చేసే రైతులు తమ సమస్యలు సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు వెళ్లినా ఆయన స్పష్టమైన హామీ ఇవ్వలేదు. సీఎం ఇటీవల గంగూరు రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన సమయంలో పలువురు రైతులు దాళ్వా సమస్యలు సీఎం దృష్టికి తీసుకు వచ్చారు. పంటకు గిట్టుబాటు ధర కావాలని మొరపెట్టుకున్నారు. అయితే సీఎం అధికారులను వర్క్అవుట్ చేయండని చెప్పారే తప్ప రైతులకు హామీ ఇవ్వక పోవటంతో ప్రసుత్తం దాళ్వా సాగు చేసే రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి న్యాయం చేయాలని, తమకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేస్తేనే రైతులకు మేలు కలుగుతుంది.

గిట్టుబాటు ధర ఇవ్వాలి



సార్వా పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇచ్చినట్లే దాళ్వా పంటకు కూడా గిట్టుబాటు ధర ఇవ్వాలి. ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలి. దళారులు దోచుకోవటంతో దాళ్వా సాగు నష్టాన్నే మిగుల్చుతుంది.

–ఎం.ప్రసాద్, వణుకూరు, పెనమలూరు.

కూటమి సర్కారు బాదుడుతో ప్రజలు కుదేలు


కంకిపాడులో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు

కంకిపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల కాలంలో సూపర్ సిక్స్ హామీలను గాలికొదిలి ప్రజలపై భారాలు మోపడమే లక్ష్యంగా పనిచేస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 27న నిర్వహిస్తున్న విద్యుత్ పోరుబాట పోస్టర్‌ను గురువారం కంకిపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెనమలూరు మండలం గంగూరు సబ్‌స్టేషన్ వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, సీహెచ్‌సీ మాజీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యుడు చిట్టూరి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నేతలు చుండూరు మోహన్‌రావు, టి.మరియబాబు, బాకీ రాజు, బాకీ చంటి, చోరగుడి మహేష్, దిమ్మిట శివ, కరీముల్లా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ చార్జీల పెంపుపై నేడు నిరసన

పెనమలూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే విద్యుత్ చార్జీలు పెంచటంపై నేడు పెనమలూరు నియోజకవర్గ స్థాయిలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నామని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ కన్వీనర్ దేవభక్తుని చక్రవర్తి తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం రూ.15,485.36 కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిందని ఆరోపించారు. సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలను దగా చేశాడని విమర్శించారు. దీనికి నిరసనగా శుక్రవారం ఉదయం 9 గంటలకు గంగూరు సబ్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేస్తామన్నారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీలు తగ్గించేవరకు వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని చెప్పారు.

విద్యుత్ చార్జీల పెంపుపై సీపీఎం నిరసన

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నేతలు కనీసం ఆరునెలలు తిరగక ముందే సామాన్యులపై భారం మోపటం తగదని సీపీఎం నాయకుడు బర్రె లెనిన్ అన్నారు. బాపులపాడు మండలం బండారుగూడెంలో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కరపత్రాలను పంపిణీ చేశారు. సామాన్యులకు చైతన్యం కల్పించే ఉద్దేశంతో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

సామాజిక భవనానికి రూ.లక్ష వితరణ



గన్నవరంరూరల్: మండలంలోని పురుషోత్తపట్నం శివారు వీఎస్‌పురంలో నిర్మిస్తున్న భక్త మార్కండేయ సామాజిక నూతన భవనానికి విజయవాడకు చెందిన తేలు శివఅభినవ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అతని తాత తేలు కృష్ణ దంపతులు గురువారం లక్ష రూపాయల చెక్కును వితరణగా అందజేశారు. మార్కండేయ సామాజిక భవన నిర్మాణ బాధ్యులైన పూర్వ వైస్ ఎంపీపీ సామల ఆంజనేయులు, నారద మునియ్య, రామకృష్ణ, నందం బుజ్జిబాబు, తేలు శివ క్రాంతి వరప్రసాద్ దంపతులు పాల్గొన్నారు.

వరిగడ్డి కొరత వాస్తవమే

సాక్షి ఎఫెక్ట్

కంకిపాడు: వరిగడ్డి కొరత వాస్తవమేనని పశుసంవర్ధక శాఖ పేర్కొంది. ఈ మేరకు కంకిపాడు పశువైద్యాధికారి డాక్టర్ జి.రవికుమార్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'సాక్షి'లో ప్రచురితమైన 'వరిగడ్డి ప్రియం' శీర్షికతో వచ్చిన కథనం పూర్తిగా వాస్తవమేనని అన్నారు. వర్ష సూచనల కారణంగా రైతులు మిషన్‌తో కోత కోయటం వల్ల వరిగడ్డి కొరత ఏర్పడిందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద బహు వార్షిక పశుగ్రాస పెంపకం అందుబాటులో ఉందన్నారు. ఈ పథకం కింద 10 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకూ భూమిలో బహు వార్షిక పశుగ్రాస సాగుకు అవకాశం ఉందన్నారు. రైతుల కూలి ఖర్చు, సాగు ఖర్చు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇస్తారన్నారు. గ్రామాల్లోని పశు వైద్య సిబ్బందిని సంప్రదించి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మిక, శ్రామిక, పేదల సమస్యలపై పోరాడుతాం

గన్నవరం: స్థానిక చింతపల్లి పాపారావు స్మారక భవనంలో గురువారం భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవం నిర్వహించారు. తొలుత ఎర్ర జెండాను ఎస్టీయూ రాష్ట్ర మాజీ కార్యదర్శి పెద్దు వెంకటరత్నం ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో మతోన్మాద బీజేపీని కేంద్రంలో గద్దె దించేందుకు ఉద్యమాలను తీవ్రతరం చేయనున్నట్లు తెలిపారు. బుద్ధవరంలో పార్టీ జెండాను సీనియర్ నేత కొండా వీరాస్వామి ఆవిష్కరించారు.

కంకిపాడులో ఉచిత వైద్య శిబిరం



కంకిపాడు: కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు ఆధ్వర్యంలో కంకిపాడు బ్రాంచిలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. బ్యాంకు స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బ్రాంచి కార్యాలయంలో రజతోత్సవం సందర్భంగా చిన్మయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 200 మంది ఖాతాదారులకు వైద్య సేవలు అందించారు. అనంతరం వైద్య సేవలు అందించిన ఆసుపత్రి వైద్యులు కొడాలి పానకాలరావు, దుర్గాభవాని, కొడాలి రమ్యశ్రీలను బ్యాంకు ప్రతినిధులు సత్కరించారు.

హైందవ శంఖారావం సభ ఏర్పాట్లు పరిశీలన

గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో జనవరి 5వ తేదీన జరగనున్న హైందవ శంఖారావం బహిరంగ సభ ప్రాంగణాన్ని గురువారం బీజేపీకి చెందిన ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి పరిశీలించారు. విశ్వ హిందూ పరిషత్ నేతలతో కలిసి ఆయన సభ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 65 ఎకరాల్లో సభ ప్రాంగణంతో పాటు వాహనాల పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. సుమారు రెండు లక్షల మంది ఈ సభకు హాజరుకానున్నట్లు తెలిపారు. సభకు వచ్చిన వారందరికీ భోజనం, వసతి, టాయిలెట్స్ వంటి సదుపాయాలను కల్పించనున్నట్లు చెప్పారు. వీహెచ్‌పీ నేతలు రాజు, శ్రీమన్నారాయణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆదోని ఎమ్మెల్యే పీవీ పార్థసారథి

పేద వర్గాల ఆశాజ్యోతి వీఎం రంగా

కంకిపాడు: పేద వర్గాల ఆశాజ్యోతి వీఎం రంగా అని వక్తలు కొనియాడారు. వీఎం రంగా వర్ధంతి కార్యక్రమం గురువారం బస్టాండు సెంటరులోని రంగా విగ్రహం వద్ద నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా ఆశయాల సాధన కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ మాజీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ టి.మరియబాబు, నాయకులు చుండూరు మోహన్‌రావు, కె.బసవయ్య, కె.కోటేశ్వరరావు, దిమ్మిట శివ, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు. స్థానిక రంగా విగ్రహం సెంటరులో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొని రంగా విగ్రహానికి నివాళులర్పించారు. సీహెచ్‌సీ ప్రాంగణంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి చైర్మన్ బి.రోహిణి, నాయకులు బి.నాగరాజు పలువురు యువత పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతుడు వీఎం రంగా

నున్న(విజయవాడరూరల్): కుల, మతాలకు అతీతంగా ప్రజలందరి తరఫున నిలబడిన నాయకుడు వంగవీటి మోహనరంగా అని వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. నున్న గ్రామంలో గురువారం జనసేన గ్రామ అధ్యక్షుడు మండా యుగంధర్ అధ్యక్షతన వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని సాంబిరెడ్డి, వీఎం రంగా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దండు సుబ్రహ్మణ్యంరాజు, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, కాటూరి శ్రీనివాసరావు, మండా యుగంధర్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాసరెడ్డి, యర్కారెడ్డి కోటిరెడ్డి పలువురు కాపు నాయకులు పాల్గొన్నారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు.


కంకిపాడులో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి పెట్టాలి

పెనమలూరు: విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించాలని మెకానికల్ ఇంజినీరింగ్‌లో విశిష్ట నిపుణుడిగా ఖ్యాతి గడించి దేశంలో పలు ఐఐటీలలో బోధించిన ప్రొఫెసర్ శేషు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో గురువారం జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లర్నింగ్ (ఎంఎల్), డేటా సైన్స్ వంటి కోర్సులు చదవటం నేడు విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. ఆధునిక టెక్నాలజీలపై పట్టు సాధించాలని సూచించారు. అనంతరం ప్రొఫెసర్ శేషును కాలేజీ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. సదస్సులో వైస్ చాన్సలర్ వెంకటేశ్వరరావు, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీ రత్న ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, సీఎస్ఈ హెచ్‌వోడీ రాజేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రొఫెసర్ శేషును సన్మానిస్తున్న వైస్ చాన్స్‌లర్ వెంకటేశ్వరరావు

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు


అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ భావన్నారాయణ

కంకిపాడు: భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ వి.భావన్నారాయణ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు శివారు కొణతనపాడు గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో గ్రామానికి చెందిన పలువురు అర్జీలు సమర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు భాస్కరరావు, ఆర్ఐ ఉస్మాన్, సిబ్బంది పాల్గొన్నారు.

సావరగూడెంలో రెవెన్యూ సదస్సు

గన్నవరంరూరల్: మండలంలోని సావరగూడెం గ్రామంలో గురువారం తహసీల్దారు కేవీ శివయ్య అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో స్థానిక రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. భూములకు సంబంధించి రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ సదస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రైతులు అందజేసిన అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. సర్పంచ్ అట్ల నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.


సావరగూడెంలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు శివయ్య

నేడు గంగూరులో రెవెన్యూ సదస్సు

పెనమలూరు: నేడు గంగూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. గంగూరు సచివాలయంలో శుక్రవారం ఉదయం సదస్సు నిర్వహిస్తామని, భూ సమస్యలు ఉన్నవారు, పార్టీషన్‌లు, పొలం పాస్ పుస్తకాలు, ఇతర భూ సమస్యలపై అర్జీలు అందజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి వితరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ఏలూరు రోడ్డులోని అప్పనవీడు జెడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి రూ.లక్ష వితరణగా అందజేశారు. జాతీయ రహదారి నుంచి పాఠశాలకు వెళ్లే రోడ్డును అనుసంధానం చేస్తూ కల్వర్టు నిర్మాణం చేపట్టాలని పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు తోట పుష్పావతి పూర్వ విద్యార్థులను కోరటంతో వెంటనే మొవ్వా రమేష్ స్పందించారు. తక్షణమే పాఠశాల ప్రధాన గేట్‌కు హైవేకి మధ్య రూ.1.06 లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మించారు. భవిష్యత్‌లో పాఠశాలకు ఎలాంటి అవసరం ఉన్నా తన వంతు సహాయం తప్పక అందిస్తానని చెప్పారు. అనంతరం దాత రమేష్‌ను పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు తోట పుష్పావతి, తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు సత్కరించారు.

వాస్తవ ప్రేమకథే 'డ్రింకర్ సాయి' చిత్రం

దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రస్తుత సమాజంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతూ, ప్రధానంగా యువతకు చక్కటి వినోదంతో పాటు సందేశాన్ని పంచే సినిమా 'డ్రింకర్ సాయి' అని ఆ చిత్ర దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి అన్నారు. హనుమాన్‌జంక్షన్‌లోని కేఎస్ టాకీస్‌లో 'డ్రింకర్ సాయి' చిత్రం ప్రీమియర్ షో గురువారం ప్రదర్శించారు. దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి, చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి హీరో ధర్మ మహేష్ కుటుంబసభ్యులు, అభిమానులు సినిమా తిలకించారు. హీరో తండ్రి, కేఎస్ టాకీస్ అధినేత కాకాని వెంకటేశ్వరరావు (బాబు), తల్లి అరుణ, సోదరి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సచివాలయాల వద్ద షెడ్యూల్డ్ కులాల జాబితా

ఉంగుటూరు: షెడ్యూల్డ్ కులాల సర్వే సోషల్ ఆడిట్ జాబితాను గ్రామ సచివాలయాల వద్ద ప్రదర్శనగా ఉంచినట్లు ఎంపీడీవో ఇ.సత్యకుమార్ తెలిపారు. ఉంగుటూరులో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కుల సర్వేలో అభ్యంతరాలు స్వీకరించి చేర్పులు మార్పులు చేస్తారని చెప్పారు. ఈ నెల 26 నుంచి 31 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. జనవరి 6వరకు స్వీకరించిన అభ్యంతరాలను ఆన్‌లైన్ చేయడం, డేటా ధ్రువీకరణ చేస్తారన్నారు. 10వ తేదీన సంబంధిత గ్రామ సచివాలయాల వద్ద తుది జాబితాను ప్రచురిస్తారని వివరించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని, లేని పక్షంలో ఫిబ్రవరి నెల నుంచి సమ్మె చేపడతామని మండల సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి అన్నారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ భవానీప్రసాద్‌కు వినతిపత్రం అందజేసి వివరాలు తెలిపారు. గత సంవత్సరంలో కార్మికులు సమ్మె చేసిన కాలానికి జీతం చెల్లించాలన్నారు. అలాగే 2024 సంక్రాంతి పండుగ బోనస్ రూ.వెయ్యి, హెల్త్ ఇన్సూరెన్స్ రూ.6 వేలు కార్మికులకు ఇవ్వాలన్నారు. ఇప్పటికి అనేకసార్లు వినతిపత్రాలు అందజేసినా అధికారులు, ఎమ్మెల్యే స్పందించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. చాలా కాలంగా కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉంచారని తక్షణం సమస్యలు పరిష్కారం చేయకపోతే వచ్చే ఫిబ్రవరి నెల నుంచి సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు వై.సరళ, విజయ, కార్మికులు పాల్గొన్నారు.


కమిషనర్ భవానీప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘ నేతలు

రబీ సాగుకు మెలకువలు పాటించాలి

పెనమలూరు: రబీ సాగులో రైతులు మెలకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ఆమె గురువారం పెనమలూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సంవత్సరం రబీలో 1156 రకం నారు ఎక్కువగా ఉందన్నారు. నారు తీసే ప్రధాన పొలంలో కార్బోఫ్యురాన్ గుళికలు సెంటుకు 160 గ్రాముల చొప్పున వేసుకోవటం వలన పురుగు నివారించగలుగుతామన్నారు. నారు వేసిన తరువాత పొలంలో పొటాష్ వేయాలని అన్నారు. దమ్ములో 2 కేజీల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 20 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ వేయాలని సూచించారు. అదే కాంప్లెక్స్ ఎరువులైతే 10-26-26, లేదా 14-35-14 వేసుకోవాలని అన్నారు. డీఏపీ, 20-20-0-13 ఎరువుల కన్నా 10-26-26, 14-35-14 ఎరువులు మెరుగని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు అనూష, రైతులు పాల్గొన్నారు.


పెనమలూరులో రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో శైలజ

విద్యుత్ పోరుబాటను విజయవంతం చేయండి

ఉయ్యూరు: విద్యుత్ పోరుబాటను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్ పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 27న చేపట్టిన విద్యుత్ పోరుబాట కార్యక్రమం పోస్టరును గురువారం ఉయ్యూరులో పార్టీ నేతలు ఆవిష్కరించారు. ప్రణీత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు వరకూ విద్యుత్ చార్జీలు పెంచనని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి రాగానే 15 వేల కోట్లు విద్యుత్ చార్జీల రూపంలో ప్రజలపై భారం మోపడం విడ్డూరంగా ఉందన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకునే వరకూ ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ నెల 27న చేపట్టిన పోరుబాటను విజయవంతం చేయాలని, పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుల్ కలాం, మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, ప్రభుత్వాసుపత్రి కమిటీ మాజీ చైర్మన్ జంపాన కొండలరావు, నాయకులు సద్దాం, బ్రహ్మం, పండు తదితరులు పాల్గొన్నారు.


ఉయ్యూరులో పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రణీత్‌కుమార్, వైఎస్సార్ సీపీ నేతలు

నేడు ఉచిత వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ సిల్వర్ జూబిలీ సందర్భంగా ప్రజాశక్తినగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బ్రాంచ్ హెడ్ జి. శశాంక తెలిపారు. బ్యాంక్ ఆవరణలో నిర్వహించే ఈ శిబిరంలో దీపక్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు, నేత్ర, దంత వైద్యులు పాల్గొంటారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా సాధారణ వైద్య సేవలతో పాటు, కంటి పరీక్షలు, దంత సంబంధిత పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్షలు నిర్వహిస్తారని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

చెస్‌లో విజయవాడ క్రీడాకారుల సత్తా



విజయవాడస్పోర్ట్స్: భారతీయ నవీన క్రీడా ఉత్సవ్‌లో భాగంగా జరిగిన అంతర్జాతీయ రేటింగ్ టోర్నమెంట్‌లో పాల్గొని రేటింగ్ సాధించిన విజయవాడ క్రీడాకారులను గ్లోబ్ చెస్ అకాడమీ అధ్యక్షుడు కె.రాజేంద్ర, అంతర్జాతీయ చెస్ కోచ్ షేక్ ఖాసీం అకాడమీలో గురువారం అభినందించారు. విజయవాడలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో ఇటీవల ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విజయవాడ క్రీడాకారులు మహీధర్ క్లాసిక్‌లో 1517, రాపిడ్‌లో 1540, బ్లిజ్‌లో 1433, అర్షద్‌బాబా రాపిడ్‌లో 1515, బ్లిజ్‌లో 1492, గీత శ్రీకృష్ణచైతన్య రాపిడ్‌లో 1461, షేక్ నబీహ రాపిడ్‌లో 1458, దులకర్ అహ్మద్‌ఖాన్ బ్లిజ్‌లో 1473, చరణ్‌సోమేశ్వర్ బ్లిజ్‌లో 1505, అక్షర మాచర్ల స్టాండర్డ్స్‌లో 1437 రేటింగ్ సాధించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని క్రీడాకారులను మెమెంటోలతో సత్కరించారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్ శివరామకృష్ణ, ఆంజనేయులు, బాబు పాల్గొన్నారు.